ఈటల గెలుపు ఖాయం

బీజేపీ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమల్‌రెడ్డి


నాగారం మున్సిపాలిటీలో చంద్రారెడ్డి ప్రచారం

కీసర: మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపు ఖాయమని ఆ పార్టీ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లాల తిరుమల్‌రెడ్డి అన్నారు. మంగళవారం చీర్యాల గ్రామంలో బీజేపీ నేతలతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్న బీజేపీ ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీకి మరోసారి అండగా నిలవాలని ప్రజలను కోరారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలో ఈటల తరఫున మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే ఈటల రాజేందర్‌ను గెలిపించాలని కోరారు. ప్రచారంలో కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, నాగారం బీజేపీ అధ్యక్షుడు వేణుగోపాల్, గాలి సంపత్, బోడశ్రీనివాసరావు, రమేష్‌గౌడ్, కోల బాల్‌రాజ్, వంగేపి బాపురెడ్డి, బండారి శ్రీనివాస్‌రెడ్డి, నల్ల వెంకట్‌రెడ్డి, చంద్రమౌళి, మెట్టు కృష్ణాయాదవ్, సత్యనారాయణ, పెద్దులు, నక్కకిషోర్, రాకేష్, జంగారెడ్డి, అక్కాల సురేష్, సూర్యశేఖర్‌రెడ్డి, రాముచారి, నాగరాజు, కుంటోళ్ల రవి, రవిందర్ యాదవ్, కేశవరెడ్డి, వెంకటేశ్వరరావు, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపును ఆపలేరు: సునీత


మేడ్చల్ కార్నర్ మీటింగ్‌లో ప్రసంగిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి

మేడ్చల్: ఎవరెన్ని కుట్రలు చేసినా కాంగ్రెస్ గెలుపును ఆపలేరని ఆ పార్టీ మల్కాజిగిరి లోక్‌సభ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ పట్టణంలో రోడ్ షో, గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ, మండలంలోని డబీల్‌పూర్, రావల్‌కోల్ గ్రామాల్లో పర్యటించారు. కౌన్సిలర్ భవాని రాఘవేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో మేడ్చల్‌లో నిర్వహించిన వివేకానంద విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాలు ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారని కాంగ్రెస్‌ను ఆదరిస్తారని అన్నారు. మల్కాజిగిరి కాంగ్రెస్ గెలవకపోతే పదేళ్ల అభివృద్ధి ఆగిపోతుందని అన్నారు. కార్యకర్తలు, నాయకులు 13 రోజులపాటు కష్టపడి పార్టీ గెలుపునకు పని చేయాలని కోరారు. మేడ్చల్‌కు డిగ్రీ కళాశాల, శామీర్‌పేట్ చెరువు పర్యాటక అభివృద్ధి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రచారంలో నియోజకవర్గ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్‌లు నాయకులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేయకపోతే సస్పెండే...

కార్యకర్తలకు ఎన్నికలు మంచి అవకాశామని చిన్న చిన్న విషయాలకు అలిగి పార్టీ ప్రచారం దూరంగా ఉండి పార్టీ కోసం పని చేయకపోతే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని సునీతామహేందర్‌రెడ్డి హెచ్చరించారు.

ఘట్‌కేసర్: మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డిని గెలిపించాలని పట్టణంలోని ఆరో వార్డులో ఆ పార్టీ అధ్యక్షుడు ముత్యాలుయాదవ్, ఉపాధ్యక్షుడు నాగరాజ్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రచారం చేపట్టారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య హాజరై వార్డులో ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీ హామీలను ప్రజలకు వివరించారు.

పగలు ప్రచారం.. రాత్రి మంతనాలు

- ప్రచారవ్యూహాల్లో ప్రధాన పార్టీలు
- ఆరు గ్యారంటీలతో ప్రజల్లోకి కాంగ్రెస్
- గతంలో చేసిన అభివృద్ధి ఆసరాగా బీఆర్ఎస్
- గెలుపు ధీమాతో కమలనాథులు


కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీత


బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్


బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రధాన పార్టీల ప్రచారహోరుతో మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం వేడెక్కింది. గెలుపే ధ్యేయంగా పార్టీలు వ్యూహరచనలో నిమగ్నమయ్యాయి.

ఎన్నికల తొలి ఘట్టమైన నామినేషన్ల పర్వం ముగియడంతో ప్రచార యుద్ధానికి తెరలేచింది. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీలు ప్రచార వ్యూహాలు రచించడంలో నిమగ్నమయ్యాయి. ప్రత్యర్థి పార్టీల నుంచి చేరికలతోపాటు ప్రచారాలు, రాత్రి సమయంలో అనుచర వర్గంతో మంతనాలు జరుపుతున్నారు. ఎదుటి పార్టీ ప్రచార తీరును తెలుసుకుంటూ మరుసటి రోజు ఎలా ప్రచారం చేయాలన్న అంశంపై వ్యూహరచన చేస్తున్నారు. గెలుపోటములను శాసించే మహిళలు, యువ ఓటర్లను తమ వైపు తిప్పుకొనేందుకు చక్రం తిప్పుతున్నారు. ఎత్తుకు పైఎత్తులతో మండుటెండల్లో ప్రచారపర్వానికి తెర తీయటంతో మల్కాజిగిరిలో రాజకీయ వేడి రాజుకుంటోంది.

ఆరు గ్యారంటీలు.. కాంగ్రెస్ జోరు

మల్కాజిగిరిలో గెలుపు లక్ష్యంగా అధికార కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. పలు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ నుంచి కొంతమంది ముఖ్యనేతలు కాంగ్రెస్‌లో చేరారు. ఆరు గ్యారంటీల అమలు తీరును ప్రస్తావిస్తూనే మరిన్ని పథకాలతో కాంగ్రెస్ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డి ప్రజల్లోకి వెళ్తున్నారు. నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో క్షేత్రస్థాయిలో ప్రచారానికి ప్రణాళికలు రచిస్తున్నారు. బీఆర్ఎస్ విమర్శలకు కౌంటర్లు ఇచ్చేలా రూపొందించిన పాటలను ప్రజల్లోకి తీసుకెళ్తోంది. మల్కాజిగిరి, మేడ్చల్ నియోజకవర్గాల్లో మైనంపల్లి హన్మంతరావు, తోటకూర వజ్రేష్ యాదవ్, ఉప్పల్‌లో మహేశ్వర్‌రెడ్డి, కుత్బుల్లాపూర్‌లో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, హన్మంతరెడ్డి, కూకట్‌పల్లిలో బండి రమేష్ ప్రచారం చేస్తున్నారు. ఎల్బీనగర్‌లో మాజీ ఎంపీ, ఏఐసీసీ కార్యదర్శి మధుయాష్కీగౌడ్ నేతృత్వంలో ఎన్నికల ప్రచారం సాగుతుండగా, కంటోన్మెంట్ అసెంబ్లీకి ఉప ఎన్నికల జరుగుతుండటంతో కాంగ్రెస్ పార్టీ జోరుగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తోంది. ఏఐసీసీ అగ్రనేతలతోపాటు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో కార్నర్ మీటింగ్‌లు, రోడ్ షోలకు కాంగ్రెస్ పార్టీ కసరత్తు చేస్తోంది.

గెలుపు ధీమాతో బీజేపీ దూకుడు

మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గంలో ఈసారి కాషాయ జెండా ఎగుర వేయాలన్న ధీమాతో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ జోరుగా ఎన్నికల క్యాంపెయిన్ చేస్తున్నారు. ప్రతీ రోజు ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ సంఘాలు, సామాజిక వర్గాలతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. మరోవైపు ఇతర పార్టీల్లోని నేతలు, కార్యకర్తలను తమ వైపు తిప్పుకోవడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. చేరికలపై కూడా దృష్టి సారించారు. పట్టణ, గ్రామాల్లోకి యువతను ఆకట్టుకునే ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ బీజేపీని ఆదరించాలని కోరుతున్నారు. పట్టణంతోపాటు డివిజన్లకు పార్టీ సీనియర్లకు బాధ్యతలను అప్పగించారు. పార్టీ అభ్యర్థులు, సీనియర్ నాయకులు వేర్వేరుగా ప్రచారం కొనసాగిస్తున్నారు. ఒక్కసారి అవకాశం ఇవ్వాలంటూ ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, ఉప్పల్, మేడ్చల్, ఎల్బీనగర్, కంటోన్మెంట్, కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థానిక నాయకులు, కార్యకర్తలు పార్టీ ఆదేశాల నేపథ్యంలో ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. పార్టీ అగ్రనేతలను కూడా ఎన్నికల ప్రచారంలోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

పాలక వర్గాల వైఫల్యాలపై బీఆర్ఎస్ గురి

మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో వేగాన్ని పెంచేలా బీఆర్ఎస్ వ్యూహరచన చేస్తోంది. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో ఆత్మీయ సమ్మేళనాలు, అంతర్గత సమావేశాలను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిర్వహించారు. అసెంబ్లీ నియోజకవర్గం, క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రచారానికి అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి కసరత్తు చేస్తున్నారు. గతంలో తమ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూనే ఇటీవల అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ సర్కారు వైఫల్యాలతోపాటు బీజేపీ కేంద్ర ప్రభుత్వ వైఖరిని బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారంలో తీవ్రంగా ఎండగడుతోంది. సామాజిక మాధ్యమాల ద్వారా కూడా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తోంది.

దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్: పట్టణంలోని కింది బస్తీలో నూతనంగా ఆలయం నిర్మించి నిర్వహిస్తున్న విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో మేడ్చల్ ఎమ్మెల్యే పాల్గొని పూజలు నిర్వహించాడు. స్థానిక నాయకులు, బస్తీవాసులతో కలిసి ఆయన అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అర్చన సందీప్‌గౌడ్, మహేష్, గణేష్, నాయకులు శేఖర్‌గౌడ్, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు మద్దతుగా సీపీఐ ప్రచారం చేయాలి


సమావేశంలో శశిధర్‌రెడ్డి, సునీత

మేడ్చల్: సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్‌కు సీపీఐ మద్దతిస్తున్నందున మండలంలోని సీపీఐ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి గెలుపుకోసం పనిచేయాలని మండల సీపీఐ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి కోరారు. మేడ్చల్‌లో ఆయన సునీతమహేందర్‌రెడ్డితో కలిసి ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. సీపీఐ నాయకులు కాంగ్రెస్ నాయకులతో కలిసి పార్టీ బలపరిచిన అభ్యర్థి కోసం పని చేయాలని కోరారు. అన్ని వార్డులు, గ్రామాలలో ఎర్ర జెండాలు చేతపట్టి ప్రచారం జోరుగా చేయాలని కోరారు.

బీజేపీలో మాజీ జెడ్పీటీసీ శైలజ చేరిక


శైలజకు కండువా కప్పుతున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా

మేడ్చల్: మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు జేకే శైలజా హరినాథ్ బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి బీజేపీలో చేరారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాష్ నడ్డా సమక్షంలో బీజేపీ కండువా కప్పుకున్నారు. మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ పిలుపుతో ఆమె బీజేపీ వైపు అడుగులు వేశారు. బీఆర్ఎస్‌లో కార్యకర్తల శ్రమను గుర్తించడం లేదని, ఎమ్మెల్యే మల్లారెడ్డి ఎవరినీ పట్టించుకోవడం లేదని ఆమె విమర్శించారు.

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలి


మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా అధికారులు పనిచేయాలని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ చౌదరిగూడ, కాచవానిసింగారం గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదన్నారు. మండలంలో నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, మిషన్ భగీరథ నీరు సరఫరా కాకున్న నీటి బిల్లులు వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి, వైస్ ఎంపీపీ జంగమ్మ, ఎంపీడీవో గీతారెడ్డి, ఎంపీఓ రవి ఎంపీటీసీలు శోభారాణి, వినోద, భాస్కర్‌రెడ్డి, రామారావు ముదిరాజ్, రవి, కోఆప్షన్ సభ్యులు ఎక్బాల్, సూపరింటెండెంట్ కుమార్ పాల్గొన్నారు.

పదిలో తగ్గిన ఉత్తీర్ణతాశాతం

- జిల్లాలో బాలుర కంటే బాలికలదే పైచేయి
- గతేడాది ఉత్తీర్ణత శాతం 90.72.. ఈసారి 89.61 శాతం
- బాలుర ఉత్తీర్ణత శాతం 87.35.. బాలికలు 92.03 శాతం
- జిల్లాలో జీపీఏలో 10/10 సాధించిన విద్యార్థులు 1,652 మంది
- ఇందులో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు ముగ్గురు మాత్రమే..

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం తగ్గింది. గతేడాది 90.72 శాతం మంది ఉత్తీర్ణత సాధించగా, ఈ ఏడాదిలో 89.61 శాతం మంది విద్యార్థులు పాసయ్యారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు 896 ఉన్నాయి. మొత్తం 46,736 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 41,879 మంది ఉత్తీర్ణత(89.61శాతం) సాధించారు. ఇందులో బాలురు 24,192 మంది పరీక్ష రాయగా, 21,131 మంది ఉత్తీర్ణత (87.35 శాతం) సాధించారు. బాలికలు 22,544 మందికిగాను 20,748 మంది ఉత్తీర్ణత(92.03శాతం) సాధించారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినీవిద్యార్థుల్లో 1,652 మంది జీపీఏలో 10/10 సాధించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయకుమారి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 7,500 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాయగా, ఇందులో 6,200 మంది విద్యార్థులు ఉత్తీర్ణత (81 శాతం) సాధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో జీపీఏలో 10/10 శాతం సాధించిన విద్యార్థులు ముగ్గురు మాత్రమే ఉన్నారు.

మేడిపల్లిలో అత్యధికం.. మల్కాజిగిరిలో అత్యల్పం..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని 14 మండలాల్లో పదోతరగతి ఉత్తీర్ణత శాతాన్ని పరిశీలిస్తే.. అత్యధికంగా మేడిపల్లి మండలంలో 93.52 శాతం, అత్యల్పంగా మల్కాజిగిరి మండలంలో 86.68 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కూకట్‌పల్లి మండలంలో 92.88 శాతం, మేడ్చల్ మండలంలో 91.43, బాచుపల్లి మండలంలో 90.95, దుండిగల్ మండలంలో 90.49, కుత్బుల్లాపూర్ మండలంలో 90.24, ఉప్పల్‌లో 88.15, అల్వాల్ మండలంలో 88.12, కీసర మండలంలో 88.07, ఘట్కేసర్ మండలంలో 87.85, ఉమ్మడి శామీర్‌పేట మండలంలో 87.53, కాప్రా మండలంలో 87.21, బాలానగర్ మండలంలో 86.89, మల్కాజిగిరి మండలంలో 86.68 శాతం చొప్పున ఉత్తీర్ణత సాధించినట్లు డీఈఓ విజయకుమారి పేర్కొన్నారు.

జోరందుకున్న కాంగ్రెస్ ప్రచారం


కీసరలో కాంగ్రెస్ నేతల ప్రచారం

కీసర: ఉమ్మడి కీసర మండలం (నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీలు)లో కాంగ్రెస్ నేతల ప్రచారం జోరందుకుంది. కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి తరఫున నేతలు ఊరూరా, వాడవాడలా తిరిగి ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, 6 గ్యారంటీల గురించి ప్రజలకు వివరిస్తున్నారు. ప్రచార కార్యక్రమాల్లో నాగారం మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, కీసర మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి, తటాకం వెంకటేష్, బలిదే రమేష్ గుప్తా, మచ్చాని జంగయ్య యాదవ్, దయానంద్‌గౌడ్, రాయిల శ్రావణ్‌కుమార్ గుప్తా, రామిడి స్వప్న, తటాకం లక్ష్మణ్, ఉమాపతి, జూపల్లి రవీందర్, మల్లేష్, ముద్దం వెంకటేష్, అశోక్, అరుంధతి, ముద్దం మల్లేష్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరిసిన పేదింటి కుసుమాలు

రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయినా 9.7 జీపీఏతో ప్రతిభ చాటిన రుచిత


రుచిత 9.7 (జీపీఏ)

మేడ్చల్: మండలంలోని నూతన్‌కల్ గ్రామానికి చెందిన పేదింటి పిల్లలు పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించి చదువుకు పేదరికం అడ్డురాదని నిరూపించారు. గ్రామానికి చెందిన కురుమ రుచిత తల్లితండ్రులు స్వామి, సరిత, సోదరుడు రాంచరణ్ 3 ఏళ్ళ క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆమె, సోదరి కలిసి బాబాయ్ రాజు, పిన్ని భార్గవి వద్ద ఉంటూ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్నారు. సోదరి ఇంటర్మీడియట్ చదువుతుండగా రుచిత ఈ సంవత్సరం పదవ తరగతి పరీక్షలు రాసింది. కుటుంబమంతా ప్రమాదంలో మృతి చెందినా, పుట్టెడు దుంఖంలో ఉండి సైతం చదువును నిర్లక్ష్యం చేయకుండా రుచిత పరీక్షల్లో 9.7 జీపీఏ సాధించింది.

10/10 జీపీఏ సాధించిన కుమ్మరి లక్ష్మీప్రసన్న


లక్ష్మీ ప్రసన్న 10/10 (జీపీఏ)

గ్రామానికి చెందిన కుమ్మరి లక్ష్మీ ప్రసన్న పదవతరగతి ఫలితాల్లో 10,/10 జీపీఏ సాధించింది. తండ్రి వినోద్‌కుమార్ విద్యుత్ శాఖలో చిరు ఉద్యోగి. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివిన లక్ష్మీ ప్రసన్న 10/10 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచింది.

కీసర మండలంలో పదో తరగతి పరీక్ష ఫలితాలు ఇలా..


కె.రామ్‌చరణ్‌రెడ్డి 10'10 (జిపిఏ) కీసర జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి

కీసర: ఉమ్మడి కీసర మండలంలో ప్రభుత్వ పాఠశాల్లో పదవ తరగతి పరీక్షలో 65 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ శశిధర్ తెలిపారు. ఉమ్మడి కీసర మండలంలో 7 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలుండగా 624 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. అందులో 406 (65శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. కీసర జెడ్పీహెచ్ఎస్ మండల స్థాయిలో 75 శాతం ఉత్తీర్ణత సాధించి ప్రథమస్థానంలో నిలిచింది. 96 మంది విద్యార్థులకుగాను 72 (75 శాతం) మంది ఉత్తీర్ణత సాధించగా కె.రామ్‌చరణ్‌రెడ్డి విద్యార్థి 10/10 జీ.పి.ఏ సాధించాడు. జెడ్పీహెచ్ దమ్మాయిగూడ పాఠశాల్లో 114 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 72(63శాతం) మంది ఉత్తీర్ణత సాధించగా పూర్ణప్రియ అనే విద్యార్థిని 9.8 జీపీఏ సాధించింది. భోగారం జెడ్పీహెచ్‌స్కూల్‌లో 6 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ఇద్దరు(33 శాతం) విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. జెడ్పీహెచ్ఎస్ చీర్యాల స్కూల్‌లో 71మంది విద్యార్థులకుగాను 44 (62శాతం) మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. జెడ్పీహెచ్ఎస్ నాగారం స్కూల్‌లో 196 విద్యార్థులు పరీక్షలు రాయగా 123 (73 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. జెడ్పీహెచ్ఎస్ రాంపల్లిలో 99 విద్యార్థులు పరీక్షలు రాయగా 64 (65 శాతం) జెడ్పీహెచ్ఎస్ యాద్గార్‌పల్లిలో 42 మంది విద్యార్థులకుగాను 29(69శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు.

వినియోగదారులను చితకబాదిన కృష్ణాస్ మార్ట్ సిబ్బంది

ఘట్‌కేసర్: ఐక్రీం కొనుగోలు చేయడానికి వెళ్లిన వినియోగదారులను కృష్ణాస్ మార్ట్ సిబ్బంది చితకబాదిన సంఘటన ఘట్‌కేసర్‌లో సోమవారం రాత్రి జరిగింది. సీఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... యాదాద్రి జిల్లా బొమ్మలరామారం మండలం నాగినేనిపల్లి గ్రామానికి చెందిన అరిగే సోని(30), భర్త సాయికుమార్, కూతురు జెస్సీకాతో కలిసి యంనంపేట్‌కు వెళుతున్నారు. ఘట్‌కేసర్‌కు చేరుకోగానే కూతురు ఐస్‌క్రీమ్ కావాలని కోరడంతో పట్టణంలోని కృష్ణాస్ మార్ట్‌లోకి వెళ్లారు. ఐస్‌క్రీమ్ కావాలని సిబ్బందిని కోరగా లేవంటూనే సాయికుమార్‌ను చితకబాదారు. అడ్డుకోబోయిన సోని దుస్తులు పట్టుకున్నారు. సోనీ ఫిర్యాదు మేరకు నిందితులు జీశాంత్, అజిత్‌సింగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చేపలవేటకు వెళ్లి వ్యక్తి మృతి


మల్లేశ్ (ఫైల్)

శామీర్‌పేట్: చేపలవేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు వాగులో పడి మృతి చెందిన సంఘటన మంగళవారం వెలుగుచూసింది. మూడుచింతలపల్లి మండలం అద్రాస్‌పల్లి గ్రామానికి చెందిన కావలి మల్లేశ్(55) సోమవారం సాయంత్రం ఎల్లగూడం వద్ద గల వాగులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. రాత్రి అయినా తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబీకులు వాగు వద్ద వెతకగా మల్లేశ్ దుస్తులు, సెల్‌ఫోన్ కనిపించాయి. మంగళవారం ఉదయం మల్లేశ్ మృతదేహం నీటిపై తేలియాడుతూ కనిపించింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు.

ఈటలను గెలిపించాలని ప్రచారం

ఘట్‌కేసర్: మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో ఆ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హనుమాన్, రామతీర్థ ఆధ్వర్యంలో మంగళవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో ఇంటింటికీ తిరిగి నరేంద్రమోదీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు వివరించి కమలం పువ్వు గుర్తుకు ఓటేయాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో సుధాకర్, రాజుముదిరాజ్, దామోదర్‌రెడ్డి, గణేశ్‌ముదిరాజ్, కష్ణముదిరాజ్, విజయ్, నరసింహారెడ్డి, పోచయ్య పాల్గొన్నారు.

మేడ్చల్ మండల ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ఫలితాలు

10/10 జీపీఏ సాధించిన నూతన్‌కల్ పాఠశాల విద్యార్థి

మేడ్చల్: మేడ్చల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో మెరుగైన ప్రదర్శన కనబరిచారు. మండలంలో 13 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలుండగా అన్ని పాఠశాలలో విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారు. నూతన్‌కల్ గ్రామానికి చెందిన కుమ్మరి లక్ష్మీ ప్రసన్న నూతన్‌కల్ పాఠశాలలో చదివి 10/10 జీపీఏ సాధించి ప్రభుత్వ పాఠశాలల్లో మండల టాపర్‌గా నిలిచింది. మండలంలోని 13 ప్రభుత్వ పాఠశాలల్లో 611 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా 473 మంది ఉత్తీర్ణత చెందారు. మండల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం 77.41 శాతంగా నమోదైంది.

పాఠశాలల వారీగా...

మండలంలో 13 జిల్లా పరిషత్ పాఠశాలలుండగా గిర్మాపూర్ పాఠశాలలో 95.45 శాతం మంది ఉత్తీర్ణత చెందారు. జెడ్పీహెచ్ఎస్ గౌడవెళ్లి 81.33, మేడ్చల్ జెడ్పీహెచ్ఎస్ బాలుర 80.3, బాలికల పాఠశాల 62.3, గుండ్లపోచంపల్లి 92.02, పూడూర్ 66.7, రావల్‌కోల్ 78. మునీరాబాద్ 62.5, రాజబోల్లారం 72.4, అత్వెల్లి 72.7 డబీల్‌పూర్ 75, శ్రీరంగవరం 92, నూతన్‌కల్ 64.5 శాతం ఫలితాలు సాధించినట్లు ఏంఈఓ వసంతకుమారి తెలిపారు.

అన్నోజిగూడ జడ్పీ స్కూల్‌లో 69 శాతం ఉత్తీర్ణత

పోచారం: అన్నోజిగూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు 69 శాతం ఉత్తీర్ణత సాధించారు. 39 మంది పరీక్షలు రాయగా 27 మంది ఉత్తీర్ణులయ్యారు. భార్గవి 8.5, శ్రీలక్ష్మి 8.3, కంచన్ 8.2 జీపీఏ సాధించారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఉత్తమ ఫలితాలు


అన్నికగుప్తా (9.5/10)


అన్నం అనఘ (9.3/10)

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పదవ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో జవహర్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు అన్నిక గుప్తా (9.5/10), ప్రణీత్ (9.5/10), అన్నం అనఘ (9.3/10) సాధించారు. బాలాజీనగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉషాశ్రీ, ప్రణీత్‌లు (9.2/10), సాయిశ్రీ, అలేఖ్యలు (9.0/10) జీపీఏ సాధించారు. అనంతరం పాఠశాల యాజమాన్యం విద్యార్థులను అభినందించారు.

బీటెక్ విద్యార్థి అదృశ్యం


ఆశ్రిత్

పోచారం: బీటెక్ విద్యార్థి అదృశ్యమైన సంఘటన పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... కరీంనగర్‌కు చెందిన ఆశ్రిత్(19) వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీ హాస్టల్‌లో ఉంటూ బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల తన రూమ్‌మేట్‌తో డబ్బుకు సంబంధించిన సమస్య వచ్చింది. దీన్ని మనస్సులో పెట్టుకొని ఈ నెల 25న తన గదిలోనే ఫోన్ వదిలేసి ఎవరికీ చెప్పకుండా హాస్టల్ నుండి వెళ్లిపోయాడు. ఆచూకీ తెలియకపోవడంతో ఆశ్రిత్ తల్లి పి.అనిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్య



మేడ్చల్‌రూరల్: భర్తతో విడిపోయి ఒంటరిగా ఉంటున్న ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు... మేడ్చల్ మండలం మునీరాబాద్ గ్రామానికి చెందిన వంగరి నవనీత(33) కొంతకాలంగా భర్తతో విడిపోయి అమ్మగారి ఇంట్లో ఉంటుంది. కాగా, మంగవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.

ఎన్నికల ఉల్లంఘనపై 'సీ-విజిల్'

ఫిర్యాదు చేయాలన్న జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: బాధ్యత కలిగిన ప్రజలు ఎన్నికల అక్రమాలు, ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయాలనుకుంటే... సీ–విజిల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఎలక్షన్ కమిషన్ రూపొందించిన సీ –విజిల్‌ను మొబైల్ యాప్‌లో గూగుల్ ప్లేస్టోర్‌లో డౌన్‌లోడ్ చేసుకొని, మొబైల్ నంబర్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలన్నారు. తదుపరి ఓటీపీ వస్తుందని దానిని నమోదు చేస్తే సీ–విజిల్ యాప్ సిద్ధమైనట్లేనని తద్వారా ఎన్నికల అక్రమాలపై ఫిర్యాదు చేయొచ్చని ఎన్నికల అధికారి పేర్కొన్నారు. ఎన్నికల నియమావళికి భిన్నంగా ఉన్న దేనిపైన అయినా ఫిర్యాదు చేయొచ్చన్నారు. సీ– విజిల్ యాప్ ద్వారా డబ్బు పంపకాలు, ఉచితాలు, ఓటర్లను ప్రలోభ పెట్టినా, మద్యం సరఫరా చేసినా, నేరపూరిత చర్యలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసినా, లెక్కకు మించి అభ్యర్థులు ఖర్చు చేసినా, మతపరమైన ప్రసంగాలు చేసినా... తాజాగా తీసిన ఫొటోలు, వీడియోలు, ఆడియో రికార్డ్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చన్నారు. ఎక్కడైతే ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరిగిందో, దానికి సంబంధించిన ఫోటో లేదా వీడియో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ ఫిర్యాదుతో 100 నిమిషాలలోపే ఎన్నికల ఉల్లంఘనపై చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. సీ–విజిల్ యాప్‌లో అప్‌లోడ్ చేసిన ఫిర్యాదులు వెంటనే జిల్లా ఎన్నికల అధికారి నియంత్రణలో ఉన్న మానిటరింగ్ సెల్‌కు తెలుస్తుందని, తదుపరి ఐదు నిమిషాలలోపే క్షేత్ర పరిశీలన అధికారి అయిన ఎఫ్.ఎస్.టి బృందం విచారణ నిమిత్తం అక్కడికి చేరుకుంటారన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీం 15 నిమిషాల్లో ఫిర్యాదులో తెలిపిన స్థలానికి చేరుకొని క్షేత్ర విచారణ చేసి 30 నిమిషాలలో వివరాలు సేకరించి, నివేదికను సంబంధిత రిటర్నింగ్ అధికారికి నివేదిస్తారని చెప్పారు. దీనిపై రిటర్నింగ్ అధికారి 50 నిమిషాల్లో నివేదికను పరిశీలించి ఎన్నికల నియమావళి ఉల్లంఘన జరిగినట్లయితే చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

కలెక్టరేట్‌లో 24 గంటలూ పర్యవేక్షణ

కలెక్టరేట్‌లో 24 గంటలు సీ– విజిల్ యాప్ ఫిర్యాదులపై పర్యవేక్షణ ఉంటుందని కలెక్టర్ గౌతమ్ అన్నారు. ఫిర్యాదు చేసిన వారి పేర్లు, సెల్ నంబర్లను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. సీ–విజిల్‌కు పక్కా ఆధారాలతో ఫిర్యాదు చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు సీ– విజిల్ యాప్ ద్వారా 40 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు.